# పుల్లంరాజు-2

మహారాజశ్రీ పుల్లంరాజు చక్రవర్తిగారి పరిపాలనా విశేషాల్ని మళ్ళీ వకమాట చెప్పబోతున్నాం.

చక్రవర్తి వకమాట గుర్రప్పందేలు చూడడానికి మరికొన్ని పనుల మీదా బొంబాయి వెళ్ళి పది రోజులున్నారు. ఆ పట్టుపట్టు అక్కడ నెల్లాళ్ళేనా అతను వుండవలసిన వాడే ఉండతగ్గవాడు కూడానూ. అయితే సంఘాన్నంతా దిద్దడం పని పెట్టుకోవడం చేత అతను కాలాన్ని వ్యర్థంగా పోనివ్వడం లేదు.

అతను బొంబాయిలో వున్న పదిరోజులూ అక్కడ సభలు ఫెళ్ళున పేలిపోయాయి. అవి జన సంఘాలు కావు. అవి సభలు కావు. అవి ఉపన్యాసాలు కావు ఏంచెప్పమా? దేశభక్తి అంతా కురిసిపోయిందక్కడ..

అన్ని సభలలోనూ అతనికి నచ్చినదీ! మనస్సుని కరిగించినదీ అస్పృశ్యతా నివారణ సభ ఆ సభలో జరిగిన ఉపన్యాసాల నన్నింటినీ అతను పూర్తిగా జాగ్రత్త చేయించుకున్నాడు. ఆ విషయాన్ని గురించి బజారులో దొరికే పుస్తకాలు కూడా కొన్నాడు. "మన సామ్రాజ్యంలో యీ సమస్యని మెప్పుడు విడకొడమా" అని వాయువేగ మనో వేగాలతో వచ్చేశాడతను రాజధానికి.

అతను బొంబాయిలో వుండగానే ఈ విషయం దుప్పలపూడితో వున్న అంతరంగికులకి తెలిసిపోయింది. చక్రవర్తి అస్పృశ్యతా నివారణ సభలో శ్రద్ధగా వుండడం బొంబాయి పత్రికలన్నీ పొగడి వ్రాసినవి. ఇది తెలిసి యిక్కడ వున్న దొరలూ, బంగాళీలూ వాక్ప్రవాహాలు కురిపించడానికి సర్వసన్నాహాలు పూర్తి చేసుకున్నారు.

వచ్చినదేతడవుగా అంతరంగిక సమావేశం జరిపాడు చక్రవర్తి. ఒకరి భావాలు ఒకరికి తెలిసాయి. బంగాళీలు ముందు కురికారు. దొరలు గురు పీఠం అలంకరించారు.

అప్పటికప్పుడే దుప్పలపూడి సామ్రాజ్యానికి చుట్టూ బ్రిటీషిండియాలో కాంగ్రెస్‌వారు చాలా సభలు చేశారు. అనపర్తిలో రెండు సభలయినాయి. ద్వారపూడిలో నాలుగూ, బిక్కవోలులో మూడూ, అటు రాజానగరంలో నాలుగున్నరా. నరమేమిటంటే ఆ సభకి కాంగ్రెస్‌వారు ఆసించినంతే మంది సభ్యులూ, నిశ్చయించుకున్న అధ్యక్షుడూ స్వరాజ్య పత్రిక యొక్క విలేఖకుడూ రాలేదు. ఇలాగ అనేక సభలు జరిగేయి. అన్నీ మన చక్రవర్తికి ఉద్రేకం పుట్టించాయి. ఇక తాను వూరుకోవడం మంచిదికాదనుకున్నాడు.

ఈ సంగతులన్నీ రహస్యంగా వుండి పోతాయికనకనా? పొక్కేయి, పొంగేయి. అంతటా అదే మాట అయింది. ఇదే సందని రాజధానిలో వున్న అస్పృశ్యులు ఒక

సభ చేశారు మేమూ మనుష్యులమే. మీ వొళ్లు కోస్తే యెలాంటి రక్తమాంసాలు వున్నాయో, మా వొళ్ళు కోసినా అలాంటివే వున్నాయి. మా యిప్పటి దుస్థితి మీరు కలిగించిందే గాని దేవుడు ఏర్పరచింది యెంత మాత్రమూ కాదు. బ్రిటీషిండియాలో మా భవిష్యత్తు ప్రకాశమానంగా వుంది. బ్రాహ్మలు గూడా మమ్మల్ని ఉద్ధరించడానికి సిద్ధపడుతూ వున్నారు. స్వదేశీ చక్రవర్తి పరిపాలనలో వున్న మాకు అంతకంటే ముందుగా మోక్షం రావలసి వుంది. మేమేమీ అక్రమపు కోరికలు కోరడం లేదు. మా కంటే మీ యెక్కువ యెలాగో చెప్పండీ. మీరెలాంటి హిందువులో మేమూ అలాంటి హిందువులమే. మీకు రాముడూ, కృష్ణుడూ యెలాంటి దేవుళ్ళో మాకు అలాంటి దేవుళ్ళే. మాలో గూడా మంచి వుంది. మీ పూర్వులు మాలో వున్న మంచిని గ్రహించారు. మా కులంలో పుట్టిన కొందర్ని పూజించారు. అయితే ఇప్పుడు మీరు మాకంటే చెడివున్నారు. కనక మా మంచిని గ్రహించలేకపోతున్నారు. మాలో వున్న వొక్కొక్క భక్తుడు వొక్కొక్క జ్ఞాని. మీలో చూపించండి అంత గొప్పవాళ్ళని. మీరిప్పుడేనా మంచి దారికి వస్తే మేము పూర్వపు అపకారాలు మరిచిపోతాము. ఇప్పుడు మేము కోరేవి యేమీ విశేషమైనవి కావు. కొంపలు ముంచేవీ కావు. మనుష్యుడై పుట్టినంత మాత్రాన అందరికీ వచ్చే అధికారాలే మాకూ కావాలి. మేము మీ మధ్య యెందుకు కాపరం వుండకూడదూ? మీ నూతుల్లోనూ? మీ చెరువుల్లోనూ యెందుకు నీళ్ళు తీసుకోరాదూ! మీరు మకాం చేసే సత్రాల్లో మేమెందుకు దిగకూడదు? మీ పిల్లలు చదువుకునే పాఠశాలల్లో మా పిల్లలు ఎందుకు చదువుకోరాదూ? మీరు వెళ్ళే గుళ్ళల్లోకి మేం యెందుకు రారాదూ?" అంటూ యిలాగ ఇంకా అనేక విశేషాంశాలు ఇద్దరు ముగ్గురు ఉపన్యసించారు. చివరికి ఈ అస్పృశ్యత తొలగించవలసిందని చక్రవర్తికి మహాజరు రాశారు.

"మేమదే ప్రయత్నంలో వున్నా" మని చక్రవర్తి దానికి జవాబు ఇచ్చాడు. ఈ సంగతివిని నగరం అంతా గగ్గోలు అయిపోయింది. పెద్దలు కొందరు రామచంద్రయ్య కాళ్ళ మీద పడ్డారు. "ముందు బ్రాహ్మణ్యేయం చెడుతుంది. మా తరంలో యిలాంటి ఆపత్తు రాకుండా దాటించు మహానుభావా" అని ముసలి బ్రాహ్మణ పండితులాశ్రయించారు. క్షత్రియులు "వర్ణాశ్రమాచారాలు ఈ విషయంలోనేను నిలచేటట్టు చూడం"దన్నారు. "మాలోళ్ళూ మాదిగోళ్ళూ, మనమూ ఏకమే? ఈ విడ్డూరం మేమిటండీ? తప్పించే సూత్రం చూడండి" అని వైశ్యులు చెప్పారు. ఇక శూద్రుల సంగతి చెప్పడం మెందుకూ?" కొందరు రామచంద్రయ్యతో చెప్పేరు. కొందరు "వ్యవహారం ముదిరితే మన పొలం పనులు మనమే చేసుకుందాం" అన్నారు.

రామచంద్రయ్య బాగా ఆలోచించాడు శాస్త్రాలు తిరగేశాడు. ప్రస్తుతస్థితిని పరిశీలించారు. "మనవాళ్ళు చెయ్యమంటే అది మంచిదేనా సరే చెయ్యకూడదంటారు. మతం బుగ్గయి పోతుందంటారు. కాని ఆ పని చూస్తూ చూస్తూ "కాలం మారిపోతోంది" అనుకుంటూ కిక్కురుమనకుండా చేస్తారు. శాస్త్రాలు పనికిరావు.

యుక్తులు పనికిరావు. కేవలమూ గతానుగతికత్వం సంస్కర్తలు పనిగూడా అలాగే వుంది సంఘం ఎలా వుంటే మంచిదో తోచదు. కేవలమూ ఇతర సంఘాల్ని అనుకరించడం ఒకటే రాజబాట. ఎలాదిద్దాలో తెలువదు. ఎక్కడ తోస్తే అక్కడ ఎలా తోస్తే అలా దిద్దెయ్యడమే. సంఘ సంస్కారం గుంట పువ్వులు పుయ్యడానికి కారణం ఇదీ. ఈ వ్యవహారము కూడా తల్లకిందులుగానే ప్రారంభం అవుతుంది. అయినా సమయం వచ్చే దాకా చూద్దాం" అనుకుని వూరుకున్నాడు.

వకనాడు రాజధానిలో పెద్ద సభ జరిగింది. వక దొరగారు అధ్యక్షత వహించారు. ఆ సభకి చక్రవర్తి వచ్చాడు. వక బంగాళీబాబు గడ్డం సవరించుకుంటూ ఉపన్యాసం చేశాడు. అతను అస్పృశ్యుల పక్షం వహించి మాట్లాడగా ఇంకొక బ్రాహ్మడు బ్రాహ్మలకి బుద్ధి చెప్పాడు. "మనం గొప్పవాళ్ళమే. మన జ్ఞానం అనంతమే. మన నిర్మాణం కూడా చక్కనిదే అయితే కాలక్రమేణా అది శిథిలమైపోయింది. ఇప్పుడు మనలో బ్రాహ్మణ్యం చాలదు.

సంఘాన్నంతా మునుపటి లాగా నడిపితే బాగుండవచ్చు. కాని సాధ్యం కాదు. అనేక విలక్షణ సంఘాలతో మనకిప్పుడు సంపర్కం కలిగింది. రుచులు మారాయి. దృష్టి మారింది. బ్రాహ్మణకృత్యాలు బ్రాహ్మణులకే నచ్చడం లేదు. అస్పృశ్యుల స్థితి అయోమయంగా వుంది. మన ఔదాసన్యం వల్ల వాళ్ళు మతాంతరులై పోతున్నారు. మన సంఘం వకమూల కుళ్ళిపోతూ వుండగా వకమూల తగ్గిపోతూవుంది. ఇది చాలా అపాయకరమైన సంగతి. మనమై పూనుకుని పని చెయ్యడం మంచిదీ లేకపోతే అస్పృశ్యులెదురుంటే యేం చెయ్యగలమూ?" అని ఆ బ్రాహ్మడు చాలించాడు. తరువాత దొరగారు లేచి హిందూ సంఘాన్ని ముక్కముక్కల కింద విరగ్గొట్టి వేశాడు.

సహజంగా చక్రవర్తి మనస్సు అటు వేపుకి మొగ్గి వుంది. దీనితో చురుకు పుట్టింది రాత్రి నిద్రపట్టలేదు. మర్నాడు పొద్దున్న కాఫీ పుచ్చుకోవడం తరువాయిగా 'పిలూ రామచంద్రయ్యని' అన్నాడు.

"మన సంఘమే మంచి" దనుకునే ముసలాడూ, "మన సంఘము కంటే చెడ్డది లేదు" అనుకునే పడుచువాడూ కూచున్నారు.

"విన్నావా?"

"ఏమీ సెలవూ?"

తరువాత నాతో చెప్పలేదంటే పనికిరాదు. వూరూరికీ తాఖీదులు నిన్ననే వెళ్ళిపోవలసింది. అయినా పెద్ద వాడవు నీతో చెప్పకుండా యెందుకని వూరుకున్నాను. అస్పృశ్యత. మానవుణ్ణి హీన జంతువుని కంటే అధమంగా చూడ్డం మంచిదంటావా?"

"పూర్వులలా యెందుకేర్పరిచారో-?"

"అదంతా యిప్పుడు లాభం లేదు."

"కాలానుగుణంగా మార్పులు జరగడం మంచిదే. అయితే తాఖీదీలు యేమని రాయిస్తారూ?"

"మాలమాదిగల కోరికలు విన్నావా?"

"గుళ్ళల్లోకి, పాఠశాలల్లోకీ, సత్రాల్లోకీ, వెళ్ళనివ్వడమూ, మన మధ్య కాపరం చెయ్య నివ్వడమూ, మనం నీళ్ళు తెచ్చుకొనే బహిరంగ జలాశయాల్ని వుపయోగించుకోనివ్వడము, - ఇంకా యేమేనా వుంటే యిలాంటివి-"

"అవునవును ఏమంటావు?"

"తప్పుతుందా మరీ?"

"తాఖీదులు వెళ్ళి పోవచ్చుగదా! క్షణం యుగంలా వుందినాకు"

"బంగాలీలూ, దొరలూ..."

"వాళ్ళేమంటే నీ కెందుకూ? వాళ్ళకీ నీకు యెప్పుడూ చుక్కెదురే"

"తమరలా సెలవిస్తే మాట్టాళ్ళేను నా బుద్ధి యెప్పుడూ చీకటి వేపుకే పరిగెడుతుందనే సంగతి తమకు విశదమే.

"ఆదండకం అంతా యిప్పుడెందుకూ? ఇది బోగం వాళ్ళ సంగతి లాంటిది కాదు"

"చిత్తం తమ సెలవుకి అడ్డేమిటి? ఈ విషయంలో సంస్కారం అవసరమే అయితే ప్రారంభం యెక్కడ నుంచీ అంటే అక్కడేనా అభిప్రాయం ఛేదిస్తుంది. బ్రిటీషిండియాలో జరిగే సంగతులు అగ్రజాతులు వారిని సంకరపరచడమే ఫలంగా వుంటున్నాయి. తమ యేల్బడిలో యే పని జరిగినా నిర్దుష్టంగా వుండాలని మా వంటి వాళ్ళ కోరిక. మీరు తాఖీదులు ఎలా జారీ వేయించినా నాకు సంతోషమే. అయినా నన్ను సలహా అడిగేరు. కనక వక్కమాట తమరు ప్రచ్ఛన్న వేషం ధరించి నాతో కూడా రావాలి. బంగాలీలనీ, దొర్లనీ కూడా వెంట పెట్టుకురావాలి. ఎవరూ స్వతంత్రించి యేమీ మాట్లాడకూడదు. నేనెలా చెబితే అలా చెయ్యాలి"

"ఏం చెయ్యమంటావు?"

"బయలుదేరింది మనవి చేసుకుంటాను"

చక్రవర్తికి ముసలాడు యేదో ముంచుతాడని భయం వుంది. గాని తాను సాహసిస్తే యేం చెయ్యగలడని ధైర్యం. అందరూ అనుకున్నట్లు బయలుదేరారు.

రామచంద్రయ్య శిష్యులు "చక్రవర్తి గారి అనుజ్ఞప్రకారం. రాజ్యోద్యోగులు మాల మాదిగల అస్పృశ్యతను తొలగించడానికి బయలుదేరా"రని టమ టమా వేయించారు. అది వినీ ఆ జట్టులో రామచంద్రయ్య కూడా వుండడం చూసీ పౌరులందరూ తెల్లబోయారు. అక్కడ అస్పృశ్యులు పూలదండలతోటి, కర్పూరహారాలతోటీ, గౌరవించడానికి సిద్ధంగా వున్నారు.

యుక్త సమయంలో అంతా కలుసుకున్నారు. ఈ విచిత్రం చూడడానికి అవసరమైతే కాళ్ళ మీద పడి బతిమాలడానికీ వెంటబడ్డ పౌరులు అసంఖ్యాకులై

వున్నారు. చక్రవర్తీ, దొరలూ, బంగాళీలు భవిష్యత్తు తెలియక బిటబిటలాడి పోతూ వుండగా రామచంద్రయ్య ముందుకువచ్చారు.

"దుప్పలపూడి సామ్రాజ్యంలో అస్పృశ్యత అనేది యెక్కడా వుండగూడదని మన చక్రవర్తిగారు నిశ్చయించుకున్నారు. అంటే బ్రాహ్మడూ, క్షత్రియుడు, కోమటీ, శూద్రుడూ, మంగలీ, చాకలీ, మాలా, మాదిగా. అంతా ఒక్కళ్ళని వకళ్ళు అవసరమైతే తాకవచ్చును. భోజనాలకీ, సంబంధాలకీ యిప్పుడే మీ ప్రసక్తి లేదు. అంటరాని వాళ్ళు వుండగూడదని దీని కర్థం. అంటే ఇదివరకు అంటరాని వాళ్ళు అనిపించుకునీ వాళ్ళు ఈ సామ్రాజ్యంలో నుంచి లేచిపోవాలని కాదు. ఒకడు తానెవడయినా ఇంకొకణ్ణి "దూరంగా వుండు" అనడానికి అధికారం లేదు. మనుజులంతా సమానమైన వాళ్ళు. ఈ కారణాల చేత ఇప్పుడు చక్రవర్తిగారు మా ద్వారా పంపిన సందేశం మేమిటంటే. ఈ క్షణం మొదలుకొని యీ సామ్రాజ్యంలో వుండే మాలలూ, మాదిగలూ. ఇంకా యిలాంటి వాళ్ళూ బహిరంగంగా వుండే-అంటే అందరికీ వుపయోగంలో వున్న సత్రాలూ, సావిళ్ళూ, గుళ్ళూ, గోపురాలు, పాఠశాలలూ, చెరువులూ నిరభ్యంతరంగా వాడుకోవచ్చును. ఇష్టం వున్నవాళ్ళూ, సాగిన వాళ్ళూ పట్టంలోకి, పల్లెల్లోకి వచ్చి అందరి మధ్యా కాపరం చెయ్యవచ్చును." అని చెప్పారు.

చక్రవర్తి "ఇందులో విశేషం యేమీ వుందీ" అనుకున్నాడు. "ఈ సందేశాల్ని తాను స్వయంగా వినిపించి గౌరవం పొందాలని యెత్తువేశాడనుకున్నారు. బంగాళీలు బంగాళీలు తర్జుమా చేసి చెప్పగా "మూర్ఖుడు. తాను చెప్పి రాజాజ్ఞకి విలవ తగ్గించాడు" అనుకున్నారు. దొరలు, మాలలూ, మాదిగలూ మహానందపడ్డారు. ప్రజలు తెల్లపోయి మొగమొగాలు చూసుకున్నారు. ఇలా వుండగా "అయితే ఇంకో చిన్న సంగతి వుంది" అని ఆరంభించాడు రామచంద్రయ్య. అస్పృశ్యులలో పొంగిపోతూ వున్న ఆనందలహరికి అడ్డకట్టయిపోయింది. అంతా నిశ్చేష్టులైనారు. "చక్రవర్తిగారి ఆజ్ఞని మనం బాగా అర్థం చేసుకోవాలి. దాని దురుపయోగం చెయ్యగూడదు. ఈ వరం అనుభవించుతూ ఇంకా గొప్ప వరాలు కోరడానికి మీరు-అంటే అస్పృశ్యులు అర్హత సంపాదించుకోవాలి. బహిరంగంగా వున్న సంస్థలన్నప్పుడు దేనికి, గూడా మినహాయింపులు లేవు. ఈ సామ్రాజ్యంలో అనేక జాతులు వున్నాయి. వారికి చక్రవర్తిగారు ప్రత్యేక పాఠశాలలు వగైరాలు యేర్పరిచారు. అవన్నీ ఇందులోనే చేరతాయి. మన చక్రవర్తిగారి యీ విఘాహము అమలు జరపడానికి ముందు యింకోపని చెయ్యవలసి వుంది., అదేమిటంటే? మాలలూ మాదిగలూ మా కందరికీ సమానంగా అస్పృశ్యులై వున్నారు. అయినా మీలో మీకు బేధాలు వున్నాయి. ముందు మాదిగలు మాలలు నూతులూ వగైరాలు వుపయోగించుకోవాలి. మాలలు వాట్లని యధాపూర్వంగానే వాడుకోవాలి. ఇలా వక్క వారం రోజులు గడిచాక మాల మాదిగలు వచ్చి అంతటా వున్న నూతులు వగైరాలు

వాడుకోవచ్చును" అని చెప్పి అతను వూరుకున్నారు. కనిపెట్టిన వాళ్ళకి అతని మొగంలో ఒక విధమైన గాంభీర్యం కనపడింది.

ఇది విని "ఇవన్నీ చిన్న విషయాలు" అన్నారు. బంగాళీలు, దొరలు షెదివి విరిచారు. చక్రవర్తి తనకేసి చూడగా రామచంద్రయ్య "మాదిగలు చూస్తారేమీ చేదలు తెచ్చుకోండి" అన్నాడు.

ఒక్క క్షణం అంతటా నిశ్శబ్దంగా వుంది ఉత్తరక్షణంలో గుసగుసలూ మొగమొగాలు చూసుకోవడం ఆరంభం అయినాయి "తొరగా రావాలి" అని రామచంద్రయ్య మళ్ళీ కేకవేశాడు.

"మంచి యుక్తి పన్నేదు" అని పౌరులానందిస్తూ వుండగా మాదిగ వకదు చేదపట్టుకు వచ్చాదు. "వుండవోయి నాగమ్మా" అంటూ ఒక మాలముసలాడు ముందుకువచ్చాడు.

"యెన్ని యుగాలయినాయో మా కులాలు పుట్టి యెవరూ చెప్పలేరు. గాని అప్పటి నుంచీ మాకు మాదిగల కోసం సంబంధం లేదు. అనేక విధాల మాకులం గొప్పదీ. నేటికి యేలిన వారు మా కులాన్ని చెరపడం మంచిది కాదు. కాదు కూడదంటే మేము ఈ రాజ్యంలో నుంచి లేచే నా పోతాము గాని మాదిగలు మా నూతులు మట్టుకుంటే వప్పుకోలేము. కనక తమరు చక్రవర్తి గారితో మనవి చేసి ఈ హుకుం రద్దు చేయించాలి" అని ఆ వృద్ధుడు కోరాడు.

రామచంద్రయ్య చక్రవర్తి దెసకు చూశాడు. చక్రవర్తి దొర్లనీ, బంగాళీలనీ చూశాడు. వారు మొగాలు వంచుకోగా రామచంద్రయ్య మళ్ళీ ఆరంభించాడు.

"ఈ రాజవంశం పుట్టి యెన్నివేల సంవత్సరాలయిందో అప్పటి నుంచి ఇంతవరకు ఈ వంశంలో పుట్టినవారి ఆజ్ఞ ఉపసంహరించుకోబడలేదు. మన ప్రస్తుత ప్రభువు చాలా భూతదయకలవాడు. మాదిగలు వచ్చి నీళ్ళు తోడుకోపోతే మీరిప్పుడెలా అడ్డుపెట్టారో మీరు తోడు కోపోతే తక్కిన అగ్రజాతులు కూడా అలాగే అడ్డుపెట్టవచ్చును. అంచేత శ్రీ చక్రవర్తిగారు అడ్డువచ్చిన వారిని సైనికుల చేత ఈడ్పించి వేసి ఈ హుకుం అమలు జరిపించవలసిందని సెలవిచ్చారు. మీరు పెద్ద మనిషి తరహా నిలబెట్టుకొని చెప్పినమాట వినడం మంచిది. లేకపోతే సిపాయీలని రప్పించవలసి వుంటుంది."

రామచంద్రయ్య యిలా చెప్పి "మాదిగలు చూస్తారేం" అన్నాడు "లేవండోయి" అని మాదిగలు ముందుకు రాగా మాలలు దుడ్డుకర్రలు తెచ్చారు.

రామచంద్రయ్య "ఏం సెలవూ? అని అడగ్గా చక్రవర్తి" నాకేమీ అర్థం కావడం లేదు" అన్నాడు.

"ఇందులో తెలవందేం వుంది? యుద్ధం జరుగుతుంది. ఏం సెలవూ?"

"ఏం చేలా?"

"మాదిగలు తమ నూతులు ముట్టుకుంటే వప్పుకోమంటున్నారు. మాలలు తమ నూతులు వగైరాలు చెడకుండా అలాగే వుండాలి. అగ్రజాతులు నూతులు వగైరాలు వాడుకోడానికి మాత్రం తమకి అడ్డు వుండకూడదు"

"నువ్వేం చెబుతావు?"

"నేను మనవి చేసుకోడానికి యేం వుందీ? తమరు భూతదయాపరులని యెదట చెప్పడం స్తుతిగా వుంటుంది. తమ ఆజ్ఞకి అడ్డు వుండగూడదు?"

"మాల లేమంటారూ?"

"మాట లేదు యుద్ధానికి సిద్ధం"

"సిపాయీలని రప్పిస్తే"

"మాలలకీ మాదిగలకీ జరిగే యుద్ధం మన సిపాయీలకీ మాలలకీ జరుగుతుంది"

"తప్పదంటావా"

"అలాగే తోస్తూవుంది. అయినా తమరు మారువేషం తీసేసి స్వయంగా సెలవిచ్చి చూస్తే మంచిదనుకుంటాను"

ఇది విని వెంటనే చక్రవర్తి నిజరూపం ధరించి ముందుకు వచ్చాడు. వెంటనే మాలలు దుడ్డుకర్రలు కిందపారేసి సాష్టాంగపడ్డారు.

"మహాప్రభో! ఎన్ని తరాలనుంచో యేలినోరి పాదాలు నమ్ముకుని వున్నాం. మాకులం చెరపకండి సామీ. మాకు పరాభవం చెయ్యకండి మహారాజా" అని ఒకడు వినయంగా చెప్పేడు.

"తమ సెలవుకి అడ్డులేదు. గాని వుద్ధారపు సంగతులు సెలవిస్తే ఆగలేము మాదిగలు మాకంటే అనేక విధాల తక్కువ. మా పరువు తీసెయ్యకండి దేవరా" అని యింకొకడన్నాడు.

"మాలలూ, మాదిగలూ వక్క నూతినీళ్ళు తాగడం ఇదెప్పుడైనా వుందా దొరగారూ" మా ప్రాణాలు మీ కాలి కింద వున్నాయి. నలిపేసినా మాకు సంతోషమే యెటొచ్చి యెటుపోయినా కలపడానికి అవసరం రానివ్వకండి. చక్రవర్తిగారూ" అని మరొకడన్నాడు.

"మాదిగవాళ్ళు పోయి కాళ్ళ మీద పడగా రామచంద్రయ్యగారు చేసినట్లు వుంది దొరగారూ యిదంతా ఏలిన వారు మమ్మల్ని పాలించాలండి. మాదిగలకి మాకు బుర్రలెగిరి పోయినా సిద్ధమే కానండి. వాళ్ళని మా నూతుల కాడికి రాన్వివమండి" అని ఖచ్చితంగా చెప్పాడు మరొకడు.

చక్రవర్తి దొరలకేసి, చూడగా వాళ్ళు ఏదో గొడిగారు. బంగాలీలు కేసి చూడగా "ఇది స్వల్ప విషయం" అన్నారు రామచంద్రయ్య చూడగా" యిలా వుంది" అన్నాడు.

చక్రవర్తి కి కోపం వచ్చింది? ఈ అస్పృశ్యతా నివారణ ప్రయత్నం ఇంతటితో కట్టిపెడుతున్నారు. మాలలు నా యెదట మాదిగలని బతిమాలి తీసుకువెళ్ళి తమ నూతుల్లో యెప్పుడు నీళ్ళు తోడిస్తారో అప్పుడు దీన్ని గురించి మళ్ళీ ఆలోచిస్తాను" అని వెనక్కి మళ్ళేడు.

అందరూ వెళ్ళిపోయారు. రామచంద్రయ్య మాట్లాడకుండా వెళ్ళిపోయేడు. ప్రజలు ఈ గండం తప్పినందుకు సంతోషించారు.

ఇది దుప్పలపూడి సామ్రాజ్యంలో యెప్పుడో జరిగన సంగతి. దాని ప్రకృతి స్థితిని తెలుసుకుని ఇంకో మాటు మనవి చేసుకుంటాం.

*(ప్రభుద్ధాంధ్ర - జూన్, 1925)*